
భారీ వర్షాలకు అశ్వారావుపేట-బూర్గంపాడు రోడ్డులో అడ్డంగా పడిన భారీ వృక్షం


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకమ్మ చెరువు


భారీ వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పెదవాగుకు పడిన గండి

# పెదవాగుకు పెనుముప్పు

మొదటిపేజీ తరువాయి...

వల్ల వాగు కట్టకు రెండుచోట్ల గండి పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు లోతట్టు ప్రాంతంలో ఉండే గుమ్మడవల్లి గ్రామంలోని 300 కుటుంబాలు, కొత్తూరు గ్రామంలోని 200 కుటుంబాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రాజెక్టుకు రెండు చోట్ల గండిపడిన దృష్ట్యా.. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలిసే పరిస్థితి లేదని ఆయా గ్రామాల ప్రజలకు వివరించారు. ప్రజలంతా చీకట్లోనే బిక్కుబిక్కుమంటూ కంటిమీద కునుకు లేకుండా ఆందోళన చెందుతున్నారు. పోలీసు, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అక్కడే ఉండి పరిస్థితిని అంచనా వేయడంతోపాటు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని సమీక్షిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచారు. అయితే ప్రాజెక్టు వరద నీరు దిగువకు వెళ్తుండటంతో ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం గుళ్లవాయి, మాధారం, రెడ్డిగూడెంతోపాటు మరో నాలుగు గ్రామాల ప్రజలను అక్కడి అధికారులు అప్రమత్తం చేశారు. వరద నీరంతా ఆయా గ్రామాల మీదుగా రుద్రంకోట వద్ద గోదావరిలో కలుస్తుంది.


వరద నీటిలో చిక్కుకున్న కూలీలను కాపాడుతున్న హెలికాప్టర్

### 25 మంది కూలీలకు ఎన్డీఆర్ఎఫ్ రక్షణ

భద్రాద్రి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో అశ్వారావుపేట నియోజకవర్గంలోని పెదవాగులో భారీగా వరద నీరు చేరి బచ్చువారిగూడెం-నారాయణపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగుకు రెండుచోట్ల గండి పడటంతో గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాలు నీట మునగనున్నాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, కూలీలు కలిపి 25 మంది పెదవాగు వరద నీటిలో చిక్కుకున్నారు. పెదవాగు వరద నీటిలో చిక్కుకున్న నారాయణపురం, బచ్చువారిగూడెం, ఏపీకి చెందిన మొత్తం 25 మందిని ఎన్డీఆర్ఎఫ్ బృందంతోపాటు హెలికాప్టర్ సహాయంతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. దీంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇరు రాష్ట్రాల ఎమ్మెల్యేలు జారే అదినారాయణ, చిర్రి బాలరాజు లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎగువ ప్రాంతాలకు తరలించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు నుంచి వేలేరుపాడుకు కారులో వెళ్తున్న ఐదుగురు ప్రయాణికులు వరదలో చిక్కుకున్నారు. వారు కారును వదిలేసి చెట్లను పట్టుకోవడంతోపాటు హాహాకారాలు చేశారు. అల్లూరిసీతారామనగర్ వద్ద గ్రామస్థులు వారిని రక్షించారు. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఖమ్మం నగరంతోపాటు శివారులోని రూరల్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, సత్తుపల్లి డివిజన్‌లోని సత్తుపల్లి, పెనుబల్లి, మధిర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జేవీఆర్, కిష్టారం ఓపెన్ కాస్టులలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని సింగరేణి ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

### మంత్రి పొంగులేటి నిరంతర సమీక్ష

అశ్వారావుపేట పెదవాగు ఘటనపై రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్, ఎస్పీలకు స్వయంగా ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతం ఏపీకి దగ్గరగా ఉండటంతో ఆ రాష్ట్ర సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో మంత్రి మాట్లాడారని, ఆయన విజ్ఞప్తి మేరకు వాగులో చిక్కుకున్న 30 మంది కూలీలను ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా రెండు హెలికాప్టర్లను ఏర్పాటు చేసి రక్షించిందని చెప్పారు. పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు ఏపీ, తెలంగాణ అధికారులు సమన్వయంతో పని చేయాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌ను ఆదేశించారు.

### ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగొద్దు: సీఎస్

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పెద్దవాగుకు పెద్దఎత్తున వరద రావడంతో గేట్లు ఎత్తగా దిగువ గ్రామాల రైతులు వరద నీటిలో చిక్కుకున్న ఘటనపై ఆమె సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీ, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయ పునరావాస చర్యలను సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగొద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని హెచ్చరించారు. ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎస్ వారికి స్పష్టంచేశారు. పరిసర గ్రామాల్లోని చెరువులు, కుంటలు తెగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని సూచించారు.


జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌లో దిగువకు వెళ్తున్న వరద నీరు

# ప్రాజెక్టులకు జలకళ.. 'మేడిగడ్డ'కు పెరిగిన వరద

ధరూరు/అయిజ/మహదేవపూర్/కన్నాయిగూడెం/వాజేడు, జూలై 18: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 25,174 క్యూసెక్కుల నీటిని విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. గురువారం నెట్టెంపాడుకు 1,500 క్యూసెక్కులు, భీమాలిఫ్ట్-1కు 1,300 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 870 క్యూసెక్కులు, కుడి కాల్వకు 464 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులతో మొత్తం 30,013 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తుతున్నది. 1,12,468 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 411 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధి అంబట్‌పల్లిలో ఉన్న మేడిగడ్డ(లక్ష్మీ) బరాజ్‌కు 53,400 క్యూసెక్కుల వరద వచ్చింది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్‌కు 2,52,400 క్యూసెక్కుల వరదనీరు రాగా.. మొత్తం 59 గేట్లకు గానూ 52 గేట్లను ఎత్తి 2,51,817 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు.

# పదేండ్లు అద్భుతం

మొదటిపేజీ తరువాయి...

ఇంకా 28 మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. తెలంగాణలో మాత్రం ప్రతీవందమందిలో సగటున 91 మంది పేదరికం నుంచి బయటపడగా, కేవలం ఎనిమిది మంది మాత్రమే పేదరికంలో ఉన్నట్టు నీతి ఆయోగ్ తాజా నివేదిక వెల్లడించింది. 92 స్కోరుతో పొరుగురాష్ట్రం తమిళనాడు పేదరికం తక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, 91 స్కోరుతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 86 స్కోరుతో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానాన్ని దక్కించుకొన్నది. దేశంలో అతితక్కువ పేదరికం ఉన్న రాష్ట్రాల జాబితాలో టాప్-3 రాష్ట్రాలు దక్షిణాదివే కావడం విశేషం. కాగా, బీజేపీపాలిత యూపీ 57, ఎన్డీయేపాలిత బీహార్ 39 స్కోరుతో పేదరికం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలుగా మిగిలాయి.

**తెలంగాణ భళా.. ఇలా..**

| స్థిరాభివృద్ధి లక్ష్యాలు | తెలంగాణ స్కోరు | జాతీయ సగటు స్కోరు |
|---|---|---|
| పేదరిక నిర్మూలన | 91 | 72 |
| విద్యుత్తు సరఫరా | 100 | 96 |
| ఆర్థికాభివృద్ధి | 84 | 68 |
| శుద్ధమైన తాగునీరు | 90 | 89 |
| నగరీకరణ | 86 | 83 |
| అసమానతల తొలగింపు | 65 | 65 |
| నాణ్యమైన విద్య | 64 | 61 |
| ఆకలిబాధలు లేకపోవడం | 58 | 52 |

### పన్నెండు మెరుగ్గా..

పేదరికం, ఆకలి సమస్యలు, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, శుద్ధమైన తాగునీరు-పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ ఇలా మొత్తం 13 అంశాల్లో నీతిఆయోగ్ స్కోర్‌ను వెల్లడించగా.. 12 కీలక అంశాల్లో తెలంగాణ మెరుగైన పనితీరు కనబర్చింది. సరసమైన రేటులో నాణ్యమైన విద్యుత్తు సరఫరా అంశంలో 100 మార్కులతో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. పేదరిక నిర్మూలనలో 91 మార్కులతో రెండో స్థానంలో, ఆర్థికాభివృద్ధిలో 84 మార్కులతో మూడో స్థానాన్ని దక్కించుకొన్నది. సేవల రంగంలో గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ) వాటాను పెంచడంలో, అటవీ విస్తీర్ణం పెంచడంలో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్టు నివేదిక వివరించింది.

# ఎన్‌హెచ్‌ల భూసేకరణలో పీటముడి!

- నష్టపరిహారం పెంపునకు అనుమతించని ఎన్‌హెచ్‌ఏఐ
- పరిహారం పెంచకుంటే భూములిచ్చేది లేదంటున్న రైతులు
- ట్రిపుల్ ఆర్ సహా ఇతర రహదారులపై తీవ్ర ప్రభావం


సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న ట్రిపుల్‌ఆర్ భూబాధితులు (ఫైల్)

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారుల భూసేకరణలో మరో పీటముడి పడింది. నష్టపరిహారం విషయంలో రైతులు వెనక్కు తగ్గకపోవడంతో రహదారి ప్రాజెక్టులు ముందుకు సాగే అవకాశం కనిపించడంలేదు.రాష్ట్ర ప్రభుత్వం భూముల ధరలు పెంచినా భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చేనాటికి ఉన్న ధరల ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. మానవీయ కోణంలో ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించినప్పటికీ నిబంధనలను మార్చితే తప్ప తాము చేసేదేమీ లేదని వారు అంటున్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల్లో నాగపూర్-మంచిర్యాల-విజయవాడ రహదారి, ప్రాంతీయ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) ప్రధానమైనవి. మంచిర్యాల-విజయవాడ రహదారిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తుండటంతో ఇది పూర్తిగా వ్యవసాయ పొలాలనుంచే సాగుతున్నది. వీటికోసం మొత్తం 10,000 హెక్టార్ల పైచిలుకు భూములు సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు సేకరించింది కేవలం 3000 హెక్టార్లు మాత్రమే. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులకు భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నది. దక్షిణ భాగం ట్రిపుల్ ఆర్ పనులకు అలైన్‌మెంటు ఖరారైతే నోటిఫికేషన్ జారీచేసి భూసేకరణ చేపట్టాల్సి ఉంటుంది. రాష్ట్రంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా, నష్టపరిహారం మాత్రం అరకొరగా (రిజిస్ట్రేషన్ ధరపై మూడు రెట్లు) చెల్లిస్తున్నారు. మెదక్ జిల్లాల్లో భూముల ధర బహిరంగ మార్కెట్‌లో ఎకరానికి కనీసం రూ.50 లక్షల వరకు ఉన్నప్పటికీ, రిజిస్ట్రేషన్ ధర మాత్రం సుమారు రూ. 2లక్షలుగా ఉంది. అక్కడ భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.6లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తున్నారు.

### బహిరంగ మార్కెట్ ప్రకారం ఇస్తేనే భూములు

రాష్ట్ర ప్రభుత్వం ఒకవేళ భూముల ధరలు పెంచినా రూ.2 లక్షలను రూ.4లక్షల వరకు పెంచే అవకాశం ఉంటుంది తప్ప రూ.2 లక్షలను ఒకేసారి రూ.15-20 లక్షలకు పెంచే ఆస్కారం లేదని అధికారులు చెప్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తేనే భూములు వదులుకునేందుకు రైతులు ముందుకొచ్చే వీలుంది. రాష్ట్ర ప్రభుత్వం భూముల ధరలు పెంచినా ఆ మేరకు నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలు అనుమతించడంలేదు. ఒకసారి ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలను మార్చితే అది దేశవ్యాప్తంగా వర్తిస్తుందని, అందుకే ప్రస్తుతం కేంద్రం అంతటి సాహసం చేసే వీలులేదని వారు పేర్కొంటున్నారు.

### కోర్టుకు చేరితే ప్రాజెక్టులు నిలిచిపోవాల్సిందే

ఎన్‌హెచ్‌ఏఐ చెల్లించే నష్టపరిహారం తీసుకునేందుకు రైతులు ఒప్పుకోకుంటే కలెక్టర్ అధ్యక్షతనగల ఆర్బిట్రేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఆర్బిట్రేషన్ ఇరుపక్షాలను కూర్చోబెట్టి ఓ ధరను నిర్ణయిస్తుంది. రెండు పక్షాల్లో ఏ ఒక్కరు ఒప్పుకోకున్నా భూసేకరణ ముందుకు సాగే వీలులేదు. లేనిపక్షంలో ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. కోర్టుకు చేరితే ప్రాజెక్టులు ముందుకు సాగడం కఠినతరమే.

## ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారిని మార్చండి!

**ఆ సంస్థ చైర్మన్‌కు మంత్రి కోమటిరెడ్డి ఫిర్యాదు**

హైదరాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)ప్రాంతీయ అధికారిని మార్చాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ సంస్థ చైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. రాష్ట్ర రహదారుల శాఖతో ఎన్‌హెచ్‌ఏఐ సమన్వయంతో పనిచేయడం లేదని, దీంతో రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని ఇటీవల మంత్రి ఢిల్లీ పర్యటన సందర్భంగా చైర్మన్‌కు చెప్పినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా సమాచారం కోరితే స్పందించడం లేదని ఆరోపించినట్టు తెలిసింది. దీనిపై చైర్మన్ స్పందించి ఆర్‌వోను మార్చుతామని హామీ ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# వీధి కుక్కల కట్టడికి చర్యలేవి?



**స్టెరిలైజ్ చేస్తే దాడి చేయకుండా ఉంటాయా? • ఆరు కమిటీలంటే సరిపోతుందా?**

**రాష్ట్రప్రభుత్వం తీరుపై హైకోర్టు ఆగ్రహం • పరిష్కార మార్గాలతో రావాలని ఆదేశం**

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): వీధికుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వీధి కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాలతో, పరిష్కార మార్గాలతో వారంలోగా నివేదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. వీధి కుక్కల దాడులపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వీధి కుక్కలు చిన్నారుల మీద దాడి చేసిన ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ చర్యలు ఆశాజనకంగా లేవని ఆగ్రహం వ్యక్తంచేసింది. గత విచారణలో ఎంత చెప్పినా ఫలితం అంతంతమాత్రంగానే ఉన్నదని మండిపడింది.కుక్కలను స్టెరిలైజ్ చేస్తే సరిపోతుందా? చిన్నారులపై వీరంగం చేయకుండా ఉంటాయా? అని నిలదీసింది. కుక్కల బారిన పిల్లలు పడకుండా ఉండేందుకు పరిష్కారమార్గాలతో రావాలని రాష్ర్టానికి తేల్చి చెప్పింది. ఆరు కమిటీలను ఏర్పాటు చేశామంటే సరిపోదని, చర్యలు కూడా ఉండకపోతే ఎలాగని ప్రశ్నించింది. వీధి కుక్కల దాడిలో పిల్లలు చనిపోయిన ఘటనలకు ఎవరు బాధ్యత వహించాలంటూ నిప్పులు చెరిగింది. వీధుల్లో చెత్త పేరుకుపోయినప్పుడు వీధి కుక్కల వీరవిహారం ఎక్కువవుతుందని, ఈ క్రమంలోనే పిల్లలపై కుక్కల దాడులు పెరుగుతున్నాయని అభిప్రాయపడింది. వీధుల్లో చెత్త పేరుకపోవడానికి అధికారులదే బాధ్యత అని వ్యాఖ్యానించింది. ఈ సమస్యను పరిష్కరిస్తేనే కుక్కల దాడులు తగ్గే అవకాశముందని స్పష్టం చేసింది. వీధికుక్కల నియంత్రణ సక్రమంగా లేదని, వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేయడంలేదని, సరైన ఆహారం లేకపోవడంతో జనంపై దాడి చేసి కరుస్తున్నాయని వనస్థలిపురానికి చెందిన ఎం విక్రమాదిత్య నిరుడు ఫిబ్రవరి 19న ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. నగరంలోని బాగ్ అంబర్‌పేట పాఠశాలలో కుక్కల దాడిలో ఒక విద్యార్థి మరణించినట్టు పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటోగా తీసుకుంది. గత నెల 20న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో వీధికుక్కల దాడిలో బీహార్‌కు చెందిన వలస కార్మికుని కుమారుడు మరణించాడు. జవహర్‌నగర్‌లో బుధవారం కుక్కల దాడిలో ఒక బాలుడు మరణించాడు. వీటిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ టీవినోద్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది.

# ఒక్కరోజు కూడా కొనసాగడానికి లేదు

**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కేసులో బీఆర్‌ఎస్ వాదన • విచారణను 22కు వాయిదా వేసిన హైకోర్టు**

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోపై గెలుపొందిన ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్, భద్రాచలం ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని బీఆర్‌ఎస్ పార్టీ న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఒకరోజు కూడా ఆ పదవుల్లో కొనసాగడానికి వీల్లేదని చెప్పారు. ప్రజాతీర్పును కాలరాసిన వ్యక్తులకు చట్టసభలో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వకూడదని హైకోర్టును కోరారు. స్పీకర్‌కు ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ తరఫున గెలుపొందిన కొద్దిరోజులకే కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసనసభ్యులు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావుపై అనర్హత వేటు వేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జే రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వాళ్లపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేయడం వల్ల ఇతర ఎమ్మెల్యేలు ఫిరాయించకుండా నిరోధించేందుకు వీలవుతుందని అన్నారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు ఫిర్యాదు అందినప్పటికీ చర్యలు లేకపోవడం వల్ల హైకోర్టుకు రావాల్సి వచ్చిందని వివరించారు. తమ వాదనలు పూర్తయినా ప్రభుత్వం వాదనలు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నదని అన్నారు. దీనిపై అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, స్పీకర్‌కు కోర్టులు ఉత్తర్వులు జారీ చేయలేవని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం చట్టసభకు స్పీకర్ అత్యున్నత స్థాయిలోని వారని తెలిపారు. భోజన విరామం వరకు వాదనలు కొనసాగడంతో తదుపరి విచారణను సోమవారానికి (22వ తేదీకి) వాయిదా వేయాలని కోరగా అందుకు రామచందర్‌రావు అభ్యంతరం చెప్పారు. పిటిషనర్ల వాదనలు అయ్యాక కేసు సత్వర విచారణకు ప్రభుత్వం సహకరించడం లేదని అన్నారు. మ. 3 గంటలకు విచారణ కొనసాగించి పూర్తి చేయాలని హైకోర్టును కోరారు. విచారణ ఎప్పుడు జరగాలనే అంశంపై ఏజీ అభ్యంతరం చెప్పారు. ఈ సమయంలో న్యాయమూర్తి కల్పించుకుని, ఈ వివాదంలో కోర్టును బద్నాం చేస్తున్నారని, వివాదాన్ని పరిష్కరించడమే తమ విధి అని చెప్పారు. విచారణ ఈ నెల 22కు వాయిదా పడింది.

## లోకం పోకడ




## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 33.3°c | 22.9°c |
| మెదక్ | 32.4°c | 23.5°c |
| ఆదిలాబాద్ | 31.9°c | 23.5°c |
| నిజామాబాద్ | 29.9°c | 23.9°c |
| నల్లగొండ | 29.5°c | 23.2°c |
| కరీంనగర్ | 29.0°c | 24.0°c |
| వరంగల్ | 29.0°c | 24.0°c |
| హైదరాబాద్ | 29.4°c | 24.7°c |
| మహబూబ్‌నగర్ | 27.1°c | 22.3°c |
| ఖమ్మం | 26.0°c | 23.0°c |


హైదరాబాద్‌లోని వీఎస్టీ రోడ్డులో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం

# రాష్ట్రంలో ఐదు రోజులు భారీ వర్షాలు!

హైదరాబాద్, జూలై 18 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో రానున్న ఐదు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో తాజాగా మరో అల్పపీడనం ఏర్పడిందని తెలిపింది. దీని ప్రభావంతో వర్షాలు కురువొచ్చని పేర్కొన్నది. కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను, మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు రాష్ట్రంలో బుధవారం నుంచి గురువారం వరకు పలు చోట్ల వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లా ఎరగట్లలో అత్యధికంగా 8.71 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### ఏపీలో కొట్టుకుపోయిన కారు..

ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో లోతు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ వాగును దాటుతున్న ఓ కారు కొట్టుకుపోయింది. అయితే అదృష్టవశాత్తూ వాగులోని చెట్ల పొదల్లో కారు చిక్కుకుపోవడంతో అందులో ఉన్న ఐదుగురు ఊపిరి పీల్చుకున్నారు. వీరిని కాపాడటానికి అధికారులు సహాయ చర్యలు చేపట్టారు.

### బీరు బాటిల్‌లో సిగరెట్ ముక్కలు



*యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో సరళమైసమ్మ వైన్స్‌లో గురువారం ముగ్గురు యువకులు బీరు కొనుగోలు చేశారు. బాటిల్‌ను ఓపెన్ చేసే సమయంలో అందులో సిగరెట్ ముక్కలు కనిపించాయి. వైన్స్ సిబ్బందిని నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు డిమాండ్ చేశారు.*

*-సంస్థాన్ నారాయణపురం*

# రోడ్లపై గుంతలకు ఓ యాప్

**ప్రభుత్వానికి హైకోర్టు సూచన**

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రోడ్లపై గుంతల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఒక యాప్‌ను ఏర్పాటు చేయవచ్చు కదా అని హైకోర్టు సూచించింది. జనం ఆ యాప్ ద్వారా తెలియజేసే ఫిర్యాదులను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకోడానికి సులభం అవుతుందని చెప్పింది. ఈ విధానం కర్ణాటకలో అమల్లో ఉన్నదని తెలిపింది. రోడ్లపై గుంతల పూడ్చివేతకు తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. రోడ్లపై గుంతల్లో పడి కొందరు చనిపోయారని, మ్యాన్‌హోల్స్‌లో పడి చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయని, వాళ్ల కుటుంబాలకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని అడ్వకేట్ కే అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. వాదనల తర్వాత హైకోర్టు యాప్ ప్రతిపాదన చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.